సాక్షి
ఖమ్మం
గురువారం । 29 । మే । 2025



బడి తెరిచే నాటికి రెడీ

విద్యాసంవత్సరం మొదటిరోజే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు ఇచ్చేలా సిద్ధమవుతున్నారు. 8లో



.. 'షీ'రాక్స్ సెంటర్లు

దివ్యాంగ మహిళల ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసం 'షీ'రాక్స్ సెంటర్లు ఏర్పాటుచేయిస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల సమీక్ష

ఖమ్మంవన్‌టౌన్: ప్రభుత్వం అమలుచేస్తున్న పలు పథకాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు గురువారం సమీక్షించనున్నారు. ఈమేరకు డిప్యూటీ సీఎం భట్టితో పాటు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లాకు రానున్నారు. ఉదయం 9–45గంటలకు ఖమ్మం కలెక్టరేట్‌లో మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక, భూభారతి సదస్సులతో పాటు పలు అంశాలపై అధికారులతో సమీక్షించనున్నారు.

ప్రతీ అమ్మకానికి బిల్లు తప్పనిసరి



షాపులో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ పుల్లయ్య

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలులో పలు విత్తన షాపులను జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల స్టాక్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. ప్రతీ అమ్మకంపై రైతులకు పూర్తి వివరాలతో బిల్లు ఇవ్వడమే కాకుండా ఎప్పటికప్పుడు స్టాక్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఏఓ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ నారెడ్డి సీతారామరెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

'కండక్టర్లను నియమించడం లేదు'

ఖమ్మంమయూరిసెంటర్: ఆర్టీసీ ఖమ్మం రీజియన్‌లో కండక్టర్లను ఔట్ సోర్సింగ్ విధానంలో నియమిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని రీజినల్ మేనేజర్ ఏ.సరిరామ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ కొత్తగా ఎలాంటి నియామకాలు చేపట్టడం లేదని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న ప్రకటనలు, సమాచారం పూర్తిగా అవాస్తవమని.. వీటినెవరూ నమ్మొద్దని ఆర్‌ఎం సూచించారు.

ఉత్తమ గురుకులంగా కల్లూరు



సీఎం నుంచి అవార్డు స్వీకరిస్తున్న కనకదుర్గ

కల్లూరు: 2024–25 విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీ, ఇంటర్‌లో వంద శాతం ఫలితాలు నమోదైన సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల ప్రిన్సిపాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సన్మానించారు. ఈమేరకు రాష్ట్రంలోని 234 గురుకులాలకు గాను 14 ఉత్తమ గురుకులాలుగా ఎంపికయ్యాయి. జాబితాలో జిల్లాలోని కల్లూరు గురుకులం కూడా ఉండగా, హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కనకదుర్గ బెస్ట్ ప్రిన్సిపాల్‌గా అవార్డుతో పాటు రూ.5లక్షల క్యాష్ అవార్డు అందుకున్నారు.

అంతర్ వాహిణి!

మధిరలో భూగర్భ కేబుల్‌తో విద్యుత్ సరఫరా

- ఇన్నాళ్లు ప్రధాన నగరాలకే పరిమితం..
- జిల్లాలో తొలిసారి మధిరలో ఏర్పాటుకు ప్రణాళిక
- ఫలితంగా గజిబిజి వైర్లకు చెక్.. తగ్గనున్న ప్రమాదాలు



అండర్ గ్రౌండ్ ద్వారా కేబుల్ వేసే పనులు పూర్తయితే 11 కేవీ స్తంభాలు 374, ఎల్‌టీ స్తంభాలను 85 తొలగిస్తారు. కొత్త విధానంతో తలి దఫా 123 త్రీ ఫేస్, 1,351 సింగిల్ ఫేస్ సర్వీసులకు సర్వీస్ వైర్లు బయటకు కనిపించకుండా విద్యుత్ సరఫరా జరుగుతుంది. తద్వారా వైర్ల కారణంగా జరుగుతున్న ప్రమాదాలు తగ్గిపోతాయని.. సరఫరాలోనూ అవాంతరాలు ఉండవని చెబుతున్నారు.

రెండేసి విద్యుత్ స్తంభాల మధ్య వైర్లు.. అక్కడి నుంచి ఇళ్లలోకి సర్వీస్ వైర్లు.. ఇలా ఎక్కడ చూసినా గజిబిజిగా వైర్లు కనిపిస్తుంటాయి. ఇందులో లోపాలు, తెగిపడడం వంటి ఘటనలతో ప్రమాదాలు.. ప్రకృతి వైపరీత్యాల సమయాన విద్యుత్ అవాంతరాలు.. ఎక్కడ లోపముందో గుర్తించి మరమ్మతు చేసే వరకు జనం ఇక్కట్లు పడక తప్పని పరిస్థితులు. కానీ వీటిని అధిగమించేలా ఎన్పీడీసీఎల్ భూగర్భంలో విద్యుత్ కేబుళ్లు వేసి సరఫరాకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గ కేంద్రాన్ని పైలట్‌గా ఎంపిక చేయగా.. ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

– మధిర

రూ.38.70కోట్ల వ్యయం

మధిరలో విద్యుత్ సరఫరాకు అండర్ గ్రౌండ్ కేబుళ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకోసం రూ.38.70 కోట్లు వ్యయమవుతుందని అంచనాల్లో పొందుపర్చారు. ఈ మేరకు ప్రాజెక్టు ప్రతిపాదనల ఆధారంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎన్పీడీసీఎల్ సీఎండీ కె.వరుణ్‌రెడ్డి పలుమార్లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అంతేకాక మధిర డివిజన్ ఏడీఈ అనురాధ, ఉద్యోగులు పలువురు ఇప్పటికే హైదరాబాద్ అమీర్‌పేటతో పాటు రహేజా సాఫ్ట్‌వేర్ కంపెనీల వద్ద ఏర్పాటుచేసిన అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థను పరిశీలించి, విధివిధానాలపై అధ్యయనం చేశారు.

మొదటి దశలో...

మొదటి దశగా మధిరలోని ఆత్కూరు క్రాస్ నుంచి నందిగామ బైపాస్ వరకు ఆర్‌అండ్‌బీ రహదారికి ఇరువైపులా భూగర్భంలో హైటెన్షన్(హెచ్‌టీ) 11 కేవీ, లో టెన్షన్(ఎల్‌టీ) లైన్‌ను 440 వాట్స్‌తో వేస్తారు. అలాగే, ఆర్‌పీ కాంప్లెక్స్ నుంచి బస్టాండ్ వరకు సైతం కేబుల్ ఏర్పాటుచేస్తారు. మొత్తంగా 18 కి.మీ. మేర హెచ్‌టీ లైన్, 12 కి.మీ. నిడివితో ఎల్‌టీ లైన్ ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. ఇవికాక శివాలయం రోడ్డు నుంచి ఇల్లందులపాడు సబ్‌స్టేషన్ వరకు కి.మీ. మేర 33 కేవీ లైన్ ఏర్పాటుకు ప్రతిపాదించారు. తద్వారా 64 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అవకాశం ఏర్పడుతుంది. అయితే, ప్రస్తుతం ఉన్నట్లు కాకుండా ట్రాన్స్‌ఫార్మర్లను సైతం ఆధునికీకరిస్తారు. అండర్ గ్రౌండ్‌లో హెచ్‌టీ, ఎల్‌టీ లైన్లు ఏర్పాటు చేసి ఎల్‌టీ లైన్ ద్వారా గృహ, వాణిజ్య అవసరాలకు కనెక్షన్లు ఇస్తారు. గృహ, వ్యాపార, వాణిజ్య భవనాలకు నేరుగా అండర్ గ్రౌండ్ నుంచే కనెక్షన్లు ఇవ్వనుండగా ఎక్కడ కూడా సర్వీస్ వైర్లు బయటకు కనిపించవు. పట్టణంలోని ఆర్ అండ్ బీ రహదారి నుంచి ఇరువైపులా ప్రతీ అంతర్గత రహదారిలో 100 మీ. వరకు ఎల్‌టీ లైన్ ఏర్పాటుచేసి.. వన్ టౌన్‌లో మెయిన్ రోడ్డు మినహా అన్ని చోట్ల గృహ, వ్యాపార అవసరాలకు కనెక్షన్లు ఇవ్వనున్నట్లు ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇలా మొదటి దశ పూర్తయ్యాక రెండో దశలో మధిర మొత్తం సుమారు 90 కి.మీ. పరిధిలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో పూర్తిస్థాయిలో అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరా చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



హైదరాబాద్‌లో యూజీ కేబుల్ పనులను పరిశీలిస్తున్న మధిర అధికారులు

ప్రమాదాలు తగ్గే అవకాశం



మధిర అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఇప్పటికే పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభమయ్యాయి. తద్వారా మురుగు బయటకు కనిపించదు. ఇప్పుడు అండర్ గ్రౌండ్ ద్వారా విద్యుత్ సరఫరా పనులు మొదలుకానుండడంతో ప్రమాదాలు తగ్గే అవకాశముంది.

– జంగా ప్రవీణ్‌రెడ్డి, మధిర

డీపీఆర్ సమర్పించాం...



అండర్ గ్రౌండ్ కేబుల్ ద్వారా విద్యుత్ సరఫరాకు డీపీఆర్ సమర్పించాం. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.38.70 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ సిద్ధమైంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలన కూడా పూర్తయింది.

– ఎస్.అనిల్‌కుమార్, పట్టణ ఏఈ, మధిర

భగవంతుడు కూడా కరుణించాడు..



శంకుస్థాపన సందర్భంగా హోమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు

- ప్రజల ఆశీస్సులతో మరిన్ని పథకాల అమలు
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- యడవల్లిలో ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన

ముదిగొండ: ప్రజల కోసం అనేక పథకాలు అమలుచేస్తున్న తమ ప్రభుత్వంపై దేవుడి కరుణ కూడా ఉందని.. అందుకే ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు వచ్చాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజల ఆశీస్సులతో పాటు దేవుడి దయతో మరిన్ని మంచి పనులు చేస్తామని ఆయన వెల్లడించారు. ముదిగొండ మండలం యడవల్లిలో రూ.4.75కోట్లతో చేపట్టనున్న శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు భట్టి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కుటుంబీకులతో కలిసి వచ్చిన ఆయనకు నాయకులు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ గర్భగుడిలో భట్టి విక్రమార్క – నందిని దంపతులు వారి కుమారుడితో కలిసి హోమం, శివాలయంలో పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ప్రతీసారి ఎన్నికల సందర్భంగా శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో పూజలు చేశాకే తన ప్రచారం ప్రారంభమవుతుందని, ఆ స్వామి ఆశీస్సులతో నేడు ప్రజాప్రభుత్వం ఏర్పడినందున ఆలయ అభివృద్ధికి రూ.4.75 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ నిధులు పూర్తి స్థాయిలో సద్వినియోగం అయ్యేలా పనులు నాణ్యతతో చేపట్టాలని సూచించారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని భట్టి తెలిపారు. అలాగే, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే సిలిండర్, 200యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, అర్హులకు రాజీవ్ యువ వికాసం ద్వారా స్వయంఉపాధి యూనిట్లు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి చేరే వరకు అహర్నిశలు శ్రమిస్తామని భట్టి వెల్లడించారు. ఆతర్వాత మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. ఈకార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర హస్తకళలు, గిడ్డంగుల సంస్థల చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, రాయల నాగేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీఓ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రామయ్య నిత్య కల్యాణం

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ఉత్పత్తులకు మరింత డిమాండ్

- ఎస్‌హెచ్‌జీల ఉత్పత్తుల అమ్మకానికి ప్రధాన మార్కెట్లలోనూ కేంద్రాలు
- మహిళా మార్ట్ ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మార్ట్‌లో బ్యాగ్‌లు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాల సభ్యులు రూపొందించే ఉత్పత్తులకు మరింత డిమాండ్ వచ్చేలా ప్రణాళికాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఖమ్మంలో రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 'ఖమ్మం మహిళా మార్ట్'ను బుధవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీల సభ్యులు రూపొందించిన వస్తువుల విక్రయం వారి ద్వారానే జరగాలన్న పట్టుదలతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మహిళా మార్ట్ ఏర్పాటు చేశారని తెలిపారు. తద్వారా దళారులకు కాకుండా సభ్యులకే లాభాలు వస్తాయని చెప్పారు. అయితే, ఖమ్మంలోని నాలుగు మార్కెట్లలోనూ మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటుచేయాలని తెలిపారు. ముదిగొండ మహిళలు రూపొందించిన జూట్‌బ్యాగ్‌లు బ్రాండెడ్ వాటి కంటే నాణ్యతగా ఉన్నందున మరిన్ని కేంద్రాలు ఏర్పాటుచేస్తే ఆదరణ పెరుగుతుందని మంత్రి చెప్పారు. ఆపై ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని సూచించారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలుచేస్తోందని.. ఇందులో భాగంగా టీ స్టాళ్లు, 'షీ'రాక్స్ సెంటర్లు ఏర్పాటుచేయిస్తున్నామని తెలిపారు. ఖమ్మం మార్ట్ ద్వారా వచ్చే ఫలితాలతో మిగిలిన మున్సిపాలిటీల్లోనూ ఏర్పాటుపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. అనంతరం మహిళా మార్ట్ ఆవరణలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను సైతం మంత్రి ప్రారంభించి టీ తాగారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 29వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.60 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఆర్డీఓ నరసింహారావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మురిపించిన తొలకరి

- వర్షంతో అన్నదాతల్లో హర్షాతిరేకాలు
- అత్యధికంగా వైరాలో 10.62 సెం.మీ. వర్షం
- దుక్కులు దున్నడంలో నిమగ్నమైన జిల్లా రైతాంగం



ఖమ్మంలోని ఓ విత్తనాల షాప్‌లో రైతులు

ఖమ్మంవ్యవసాయం: నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ ప్రకటించినట్లుగానే జిల్లాలో వర్షం మొదలైంది. ఏటా జూన్ 8వ తేదీ తర్వాత వచ్చే రుతుపవనాలు ఈ ఏడాది ముందుగానే విస్తరించాయి. సహజంగా మే చివరి వారంలో రోహిణి కార్తెగా పిలుచుకునే ప్రస్తుత సమయంలో ఎండలు మండిపోతాయి. ఈనెల మూడో వారం వరకు 40 డిగ్రీలకు పైగా నమోదైన ఉష్ణోగ్రతలతో జనం ఉక్కిరిబిక్కిరి కాగా.. తాజా వర్షాలతో ఉపశమనం పొందుతున్నారు. రుతుపవనాల ప్రభావంతో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజాము వరకు జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది.

అన్నదాతల్లో హర్షాతిరేకాలు

రైతులపై ఈ ఏడాది వరుణ దేవుడు ముందుగానే కరుణ చూపాడు. ముందస్తుగా వర్షాలు ప్రారంభం కావడంతో వారిలో హర్షం వ్యక్తం చేస్తూ విత్తనాల కొనుగోళ్లలో నిమగ్నమయ్యారు. పంటల సాగుకు శాస్త్రీయంగా నిర్దిష్ట సమయం ఉంటుంది. అప్పుడు విత్తనాలు వేస్తేనే పైరు ఆరోగ్యంగా ఉండటంతో పాటు అధిక దిగుబడులు వస్తాయని నమ్ముతారు. జూన్ ఆరంభానికే అపరాలు, పత్తి వంటి పంటలు, జులై చివరి నాటికి వరి వంటి పంటలను విత్తితే సకాలంలో, సమృద్ధిగా చేతికొస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది కురుస్తున్న వానలు అందుకు చిహ్నంగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో అన్ని పంటలు కలిపి 7.32 లక్షల ఎకరాల్లో సాగవుతాయని అధికారులు ప్రణాళిక విడుదల చేశారు. కాగా, ప్రస్తుత వర్షాలతో రైతులు దుక్కులు సిద్ధం చేసుకుంటూ పత్తి, అపరాల పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే, 6 – 7 సెం.మీ.ల వర్షపాతం నమోదైతే విత్తనాలు వేయొచ్చన్న శాస్త్రవేత్తల సలహా మేరకు జూన్ మొదటి వారం నుంచి పత్తి, అపరాల పంటలకు విత్తుకునే అవకాశం ఉంది.

దంచి కొట్టిన వర్షం

రుతుపవనాల కారణంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షం కురిసింది. పలుచోట్ల భారీగా వర్షం కురిసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నారు. అత్యధికంగా వైరాలో 10.62 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, కొణిజర్లలో 8.84, రఘునాథపాలెంలో 8.62, నేలకొండపల్లి 6.94, ఖమ్మం రూరల్‌లో 6.74, బోనకల్‌లో 6.62, తల్లాడ 6.04, తిరుమలాయపాలెంలో 5.74, చింతకాని 5.72, మధిలో 5.64, ఎర్రుపాలెంలో 4.26, ముదిగొండ 4.02, ఖమ్మం అర్బన్ 3.68, ఏన్కూరు 3.26 మి.మీ.ల వర్షపాతం నమోదైంది.

తుది దశకు 'యువ వికాసం'

- అర్హుల జాబితా సిద్ధం చేస్తున్న కమిటీలు
- నేడో, రేపో జిల్లా కమిటీ చేతికి..
- జిల్లాలో 95,325 దరఖాస్తులు.. 20,181 యూనిట్లే లక్ష్యం
- సిబిల్ స్కోర్ ఆధారంగానే బ్యాంకర్ల సమ్మతి?

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువవికాసం పథకం ద్వారా అర్హులకు యూనిట్ల మంజూరు ప్రక్రియ తుది దశకు చేరింది. జిల్లాలో వివిధ కార్పొరేషన్ల ద్వారా మొత్తం 95,325 యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ ఆధ్వర్యాన దరఖాస్తుల పరిశీలన పూర్తి చేశారు. ఇందులో అర్హుల వివరాలతో ఒకటి, రెండు రోజుల్లో కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న జిల్లా కమిటీకి జాబితా చేరనుంది. ఆపై మరోసారి అనర్హులు ఎవరైనా ఉన్నారా అనే పరిశీలించే అవకాశం ఉంది. ఆ తర్వాత వచ్చేనెల 2వ తేదీ నుంచి నుంచి యూనిట్ల మంజూరు ప్రారంభం కానుంది.

95 వేల దరఖాస్తులు..

రాజీవ్ యువవికాసం పథకం కింద యూనిట్లు స్థాపించేందుకు 95,325 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ప్రభుత్వం జిల్లాలో 20,181 యూనిట్లు అందజేయాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఈ పథకం కింద యూనిట్ల స్థాపన కోసం నిరుద్యోగ యువత ఎదురుచూస్తోంది. ఎస్సీ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, బీసీ కార్పొరేషన్, ఈబీసీ కార్పొరేషన్, ఎంబీసీ కార్పొరేషన్, మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్, క్రిస్టియన్ మైనార్టీ విభాగాల ద్వారా యువత దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ పథకం కింద రూ.50 వేల విలువైన యూనిట్ల నుంచి గరిష్టంగా రూ.4 లక్షల విలువైన యూనిట్ల కోసం దరఖాస్తులు అందాయి.

క్షుణ్ణంగా పరిశీలన

మండల స్థాయిలో ఎంపీడీఓలు, మున్సిపాలిటీల్లో కమిషనర్ల ఆధ్వర్యంలో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. ఈ పథకం కింద యూనిట్ల మంజూరుకు పలు నిబంధనలు విధించారు. ఒక కుటుంబంలో ఒకరికే స్వయం ఉపాధి పథకం మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. గత ఐదేళ్లలో ప్రభుత్వ పరంగా ఏ కార్పొరేషన్ నుంచి అయినా లబ్ధి పొందారా.. లేదా అనేది కూడా పరిగణనలోకి తీసుకుంటున్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించకుండా డిఫాల్టర్లుగా మారిన వ్యక్తులు జాబితాలో ఉన్నారా అనేది బ్యాంకర్లు తేల్చనున్నారు. ఈ మొత్తాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హుల ఎంపిక పూర్తి చేస్తున్నారు.

జిల్లా కమిటీకి జాబితా

రాజీవ్ యువవికాసం ద్వారా తొలుత అర్హుల జాబితాను 1:2 నిష్పత్తిలో ఎంపిక చేసి జిల్లా కమిటీకి పంపించాలని నిర్ణయించారు. ఆ తర్వాత అర్హుల ఎంపిక బాధ్యతను జిల్లా కమిటీ చూసుకోవాల్సి ఉంది. అయితే సమయం తక్కువగా ఉన్నందున మున్సిపాలిటీలు, మండల స్థాయిలోనే అర్హులను ఎంపిక చేసి జిల్లా కమిటికి పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు తెలిసింది. దీంతో మున్సిపాలిటీలు, మండల ఆఫీసుల్లోనే అర్హులను ఖరారు చేస్తున్నారు. ఈ ప్రక్రియ కూడా పూర్తి కావచ్చింది. అర్హుల జాబితా జిల్లా కమిటీకి అందించిన అనంతరం తుది జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదానికి పంపుతారు. మంత్రి ఆమోదం అనంతరం జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు.

సిబిల్ స్కోర్ బాగుంటేనే..

బ్యాంకర్లు ఏ రుణం మంజూరు చేయాలన్నా లబ్ధిదారుల సిబిల్ స్కోర్ పరిశీలించాకే ముందుకు సాగుతారు. ప్రభుత్వం ద్వారా అమలు చేసే పథకాలైనా సరే బ్యాంకర్లు సిబిల్ స్కోర్‌నే ప్రమాణికంగా తీసుకుని రుణాలు అందిస్తుంటారు. నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికలో కూడా సిబిల్ స్కోర్‌ను బ్యాంకర్లు పరిశీలన చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రే నేరుగా సిబిల్‌స్కోర్ చూడాల్సిన అవసరం లేదని తెలిపినా.. బ్యాంకర్లు మాత్రం పరిశీలన చేశారు. అధికారులు కూడా సిబిల్ స్కోర్ పరిశీలన కోసం ముందుగా దరఖాస్తులను బ్యాంకర్లకు అందజేయడం గమనార్హం. కాగా, ఇప్పటివరకు 7,722 ప్రతిపాదనలను బ్యాంకులకు పంపగా 5,183 దరఖాస్తులకు సమ్మతి లభించినట్లు తెలుస్తోంది.

కార్పొరేషన్ల వారీగా వచ్చిన దరఖాస్తుల వివరాలు

బీసీ	39,616
ఎస్సీ	29,742
ట్రైబల్	14,416
మైనార్టీ	7,412
ఈబీసీ	2,794
ఎంబీసీ	1,228
క్రిస్టియన్ మైనార్టీ	117
మొత్తం	95,325

క్లుప్తంగా

జాబ్‌మేళాకు 57 మంది హాజరు



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

ఖమ్మంరాపర్తినగర్‌: ఖమ్మం టేకులపల్లిలోని మోడల్‌ కెరీర్‌ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 57 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఏయూ స్మాల్‌ ఫైనాన్స్‌ బ్యాంక్‌, శ్రీరాం చిట్స్‌లలో ఉద్యోగాలకు జాబ్‌మేళా ఏర్పాటు చేయగా, హాజరైన వారిలో 13 మందికి నియామకపత్రాలు అందజేశారు. ఈ జాబ్‌మేళాలో జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్‌.మాధవి, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ ఉద్యోగులతో ఖాళీలు భర్తీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్‌

ఖమ్మంవ్యవసాయం: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్‌(డీసీసీబీ) ఖాళీల్లో 25 శాతం ఉద్యోగాలను పీఏసీఎస్‌ ఉద్యోగులతో భర్తీ చేయాలని తెలంగాణ ప్యాక్స్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ బాధ్యులు డిమాండ్‌ చేశారు. ఖమ్మంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో పీఏసీఎస్‌ ప్రధాన కార్యదర్శి కేవీఎస్‌ రవికుమార్‌, ప్యాక్స్‌ ఉద్యోగుల యూనియన్‌ రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ చిప్పా శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రభుత్వం జీఓ 44ను సవరించి ఉద్యోగుల బదిలీలపై తీసుకొచ్చిన జీఓ 82పై అనుమానాలు ఉన్నందున వాటిని నివృత్తి చేశాకే అమలు చేయా లని డిమాండ్‌ చేశారు. అలాగే, సహకార సంఘాల్లో 2019 తర్వాత నియమితులైన వారికి జీఓ 44 వర్తింపజేయాలని, షరతులు లేకుండా ఆరోగ్య బీమా అమలు చేయాలని కోరారు. ఏపీ ప్యాక్స్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ ప్రధాన కార్యదర్శి రఘురాం, డీసీసీబీ ఉద్యోగుల యూనియన్‌ ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ, సూర్యాపేట, మహబూబాబాద్‌, భద్రాద్రి జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఉద్యోగుల జిల్లా నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరెడ్డి తిరిగి ఎన్నిక కాగా, ప్రధాన కార్యదర్శిగా బొంత వీరబాబు ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా నల్లాల రాంబాబు, ఉండేటి దాసు, కోశాధికారిగా వనమా మల్లికార్జున్‌, మహిళా ప్రతినిధులుగా మిర్యాల నాగలక్ష్మి, కొమ్ము వెంకటరమణతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నామని వెల్లడించారు.

ట్రాన్స్‌జెండర్ల అరెస్ట్‌

రూ.1.35 లక్షలు స్వాధీనం

ఖమ్మంక్రైం: ఖమ్మం శ్రీనివాసనగర్‌లోని ఓ ఇంట్లో జూదం ఆడుతున్న ఏనిమిది మంది ట్రాన్స్‌జెండర్లను పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఖమ్మం త్రీటౌన్‌, టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు బుధవారం చేపట్టిన తనిఖీల్లో వీరు పట్టుబడ్డారు. ఈ సందర్భంగా నిందితుల నుంచి రూ.1.35 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అనారోగ్య సమస్యలతో ఆత్మహత్య

కామేపల్లి: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి పురుగులమందు తాగగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కామేపల్లి మండలం గోవిందాపురం చెందిన భూక్యా బాలకృష్ణ (40) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురై మంగళవారం ఇంట్లో పురుగులమందు తాగగా, కొసపటికి గమనించిన కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆయన బుధవారం మృతిచెందాడు. బాలకృష్ణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భార్య విజయ ఫిర్యాదుతో కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటన్న తెలిపారు.

బడి తెరిచే నాటికి రెడీ

- ప్రభుత్వ విద్యార్థుల కోసం సిద్ధమవుతున్న యూనిఫాం
- ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిన పాఠ్యపుస్తకాలు
- తొలిరోజు పంపిణీ చేసేలా సన్నాహాలు



యూనిఫామ్‌ కుట్టే పనులను పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంసహకారనగర్‌: గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసంవత్సరం మొదటి రోజే యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారు. గత ఏడాది ఈ విధానాన్ని అమలు చేసిన ప్రభుత్వం ఈసారి కూడా అదే మాదిరి సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా బడితెరిచే నాటికి పాఠ్యపుస్తకాలు,రాతపుస్తకాలు, యూనిఫాం కూడా సిద్ధం చేయిస్తోంది. ఇప్పటికే జిల్లా కేంద్రానికి చేరిన పాఠ్యపుస్తకాలను మండల కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. ఆపై పాఠశాలల వారీగా విద్యార్థుల నమోదు ఆధారంగా ప్రధానోపాధ్యాయులకు అందజేయనున్నారు. ఇక యూనిఫాం క్లాత్‌ నెల క్రితమే చేరడంతో డీఆర్‌డీఏ ఆధ్వర్యాన మహిళా సంఘాల సభ్యులతో కుట్టించడంలో నిమగ్నమయ్యారు.

3,87,790 పాఠ్యపుస్తకాలు

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని టైటిల్స్‌ కలిపి 6,59,570 పుస్తకాలు అవసరమని ప్రతిపాదించారు. ఇందులో 3,87,790 పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరాయి. మిగతావి కూడా దశల వారీగా వస్తున్నాయి. ఎప్పటికప్పుడు పుస్తకాలను మండల కేంద్రాలకు పంపిస్తున్నారు. పాఠశాల ప్రారంభానికి ముందే వీటిని పాఠశాలలకు చేర్చి తొలిరోజే విద్యార్థులకు అందించనున్నారు. ఇక నోటుపుస్తకాలు మాత్రం నేరుగా హైదరాబాద్‌ నుంచి పాఠశాలలకు చేరతాయని అధికారులు చెబుతున్నారు.

69,241 మంది విద్యార్థులు

జిల్లాలో 1,269 ప్రభుత్వ పాఠశాలల్లో 69,241 మంది విద్యార్థులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వీరికి యూనిఫాం సిద్ధం చేసేలా 2,95,420 మీటర్ల క్లాత్‌ అవసరమని అంచనా. ఇందులో తొలి దఫా 1,45,802.76 మీటర్ల క్లాత్‌ జిల్లాకు చేరింది. ఈ క్లాత్‌ను డీఆర్‌డీఏ అధికారులకు అప్పగించగా, గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాలకు, మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ పరిధిలో మెప్మా సిబ్బందితో యూనిఫాం సిద్ధం చేయిస్తున్నారు. తాజా గణాంకాల ప్రకారం 55,392 మందికి సరిపడా (80 శాతం) యూనిఫాంలు సిద్ధమయ్యాయి. మిగతావి కూడా త్వరలో సిద్ధం కానుండగా, ఇంకా అవసరమైన క్లాత్‌ రెండో దశలో జిల్లాకు చేరనుంది.

మారిన మోడల్‌..

రాష్ట్ర ప్రభుత్వం ఒకటి నుంచి 5వ తరగతి బాలురకు షర్ట్‌, నిక్కర్‌ సమకూర్చనుంది. గతంలో 8 నుంచి ఆపై తరగతుల బాలురకు ప్యాంట్‌, షర్ట్‌ ఇవ్వగా.. ఈ సారి 6,7వ తరగతి విద్యార్థులకు సైతం ప్యాంట్‌ , షర్టులు కుట్టేలా నిర్ణయించారు. అలాగే, 1 నుంచి 3వ తరగతి వరకు బాలికలకు బాటమ్‌ ఫ్రాక్‌తో పాటు షర్ట్‌, 4, 5 తరగతులకు షర్ట్‌, స్కర్ట్‌, 6 నుంచి 12వ తరగతి వరకు పంజాబీ డ్రెస్‌తో పాటు వెస్ట్‌ కోట్‌ అందిస్తారు.

కార్యాచరణ రూపొందించాం..



జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠశాలల పునఃప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం అందించేలా కార్యాచరణ రూపొందించాం. ఇప్పటికే జిల్లాకు సరఫరా అయిన పాఠ్య పుస్తకాలను మండల కేంద్రాలకు చేరవేస్తున్నాం. అదే విధంగా యూనిఫామ్‌ సైతం కుట్టే పనులు వడివడిగా జరుగుతున్నాయి.

–సామినేని సత్యనారాయణ, జిల్లావిద్యాశాఖాధికారి

రైతులకు ఊరట..

- పంటల మద్దతు ధరలు పెంచిన కేంద్రం
- పత్తికి క్వింటాకు రూ. 589, ధాన్యం క్వింటాకు రూ.69 పెంపు



పత్తి పంట

బూర్గంపాడు: వానాకాలం రైతులు పండించే పంటలకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను ప్రకటించింది. బుధవారం జరిగిన కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్‌ కమిటీ సమావేశంలో 2025 – 26 సంవత్సరానికి గాను ఖరీఫ్‌ మద్దతు ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. అత్యధికంగా నువ్వులు క్వింటాకు రూ. 820, రాగులు రూ.596, పత్తి క్వింటాకు రూ.589 మేర మద్దతు ధర పెంచింది.

14 రకాల పంటలకు..

రైతులు పండించే 14 రకాల పంటలకు మద్దతు ధరలు పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. వరికి క్వింటాకు రూ. 69, జొన్నకు రూ. 328, సజ్జలు రూ.150, రాగులు రూ. 596, మొక్కజొన్న రూ. 175, కంది రూ. 450, పెసర రూ. 86, మినుములు రూ. 400, వేరుశనగ రూ. 480, పొద్దుతిరుగుడు రూ. 441, సోయాబీన్‌ రూ.436, కుసుమలు రూ. 579, ఒలిసెలు రూ. 820, పత్తి క్వింటాకు రూ.589 మద్దతు ధరలు పెంచుతున్నట్లు ప్రకటించింది.

జిల్లాలో పత్తి, వరి సాగు అధికం..

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలతో రైతులకు కొంతమేర ఊరట కలగనుంది. పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు పెరగడం, దిగుబడి తగ్గుతుండడంతో నష్టాలు వస్తున్నాయి. ఈ ఏడాది జిల్లాలో ఎక్కువ విస్తీర్ణంలో పత్తి, ఆ తర్వాత స్థానంలో వరి సాగు చేస్తున్నారు. పత్తికి క్వింటాకు రూ. 589 మద్దతు ధర పెంపుతో రైతులకు కొంతమేర లబ్ధి చేకూరనుంది. గతేడాది పత్తి మద్దతు ధర క్వింటాకు రూ.7,521గా ఉంది. పెంచిన ధరతో ఈ ఏడాది క్వింటాకు రూ.8110 మద్దతు ధర దక్కనుంది. వరికి క్వింటాకు రూ. 69 పెంచింది. సాధారణ రకం ధాన్యం క్వింటా గతేడాది రూ. 2,300 ఉండగా ఈ ఏడాది రూ. 23695, 'ఏ' గ్రేడ్‌ రకం ధాన్యం క్వింటాకు గతేడాది రూ. 2,320 ఉండగా ఈ ఏడాది రూ. 2,389కి పెరగనుంది. ఇంకా తృణ ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలకు కూడా ధర పెరిగినా.. జిల్లాలో వాటి సాగు అంతంత మాత్రమే. మద్దతు ధరల పెంపు నేపథ్యంలో ఆ పంటలు కూడా సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాల్సి ఉంది.

ఇకపై పంటల ధరలు ఇలా..

రకం	క్వింటాకు (రూ.ల్లో)	రకం	క్వింటాకు (రూ.ల్లో)
ధాన్యం(సాధారణ)	2,369	మొక్కజొన్న	2,400
ధాన్యం 'ఏ' గ్రేడ్‌	2,389	కందులు	8,000
పత్తి(మీడియం పొడవు)	8,110	పెసలు	8,768
పత్తి(పొడవు పింజ)	7,710	మినుములు	7,800
జొన్న	3,699	వేరుశనగ	7,263
పచ్చజొన్న	3,749	పొద్దుతిరుగుడు	7,721
సజ్జలు	2,775	సోయాబీన్‌	5,328
రాగులు	4,886	కుసుమలు	9,846
ఒలిసెలు	9,537		

దివ్యాంగ మహిళలతో 'షీ'రాక్స్‌ సెంటర్లు

- ప్రతీ మండల కేంద్రంలో ఏర్పాటు చేయిస్తాం
- కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌



రఘునాథపాలెంలో 'షీ'రాక్స్‌ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌

రఘునాథపాలెం: ప్రతీ మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలతో 'షీ'రాక్స్‌ సెంటర్లు ఏర్పాటు చేస్తామని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ వెల్లడించారు. రఘునాథపాలెం తహసీల్‌ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకంలో గార్లపాటి రమాబాయికి కేటాయించిన జిరాక్స్‌ సెంటర్‌ను కలెక్టర్‌ బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సాధారణ మహిళలతో పాటు దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి యూనిట్లు కేటాయిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల వద్ద కంప్యూటర్‌తో కూడిన జిరాక్స్‌ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ సన్యాసయ్య, తహసీల్దార్‌ శ్వేత, ఎంపీడీఓ అశోక్‌కుమార్‌, ఏపీఎం కే.వీ.సుబ్రహ్మణ్యంతో పాటు జ్యోతి, లిక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, రేణుక, రాజేశ్వరి, ఉపేంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంఅర్బన్‌: రైతులు ఆయిల్‌పామ్‌ వంటి లాభసాటి పంటలపై దృష్టి సారించాలని, పంట మార్పిడి విధానంతో నష్టాలు తగ్గి లాభాలు పెరుగుతాయని కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ తెలిపారు. ఖమ్మంఅర్బన్‌, రఘునాథపాలెం మండలాల్లో పర్యటించిన ఆయన బల్లేపల్లిలో కుర్ర మహేష్‌ సాగుచేస్తున్న ఆయిల్‌పామ్‌ తోటను పరిశీలించి రైతులతో సమావేశమయ్యారు. సాగులో ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు, పెట్టుబడి ఎంత అయింది, ఎంత దిగుబడి సాధించారనే అంశాలపై ఆరా తీశాక మిగతా రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్‌లో అంతర్‌ పంటల ద్వారా మొదటి మూడేళ్లు ఆదాయం ఉంటుందని, పంట దిగుబడి మొదలయ్యాక ఏటా నికర ఆదాయం వస్తుందని కలెక్టర్‌ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి ఎంవీ మధుసూదన్‌, హెచ్‌ఓ నగేశ్‌, ఏడీఏ కొంగర వెంకటేశ్వర్లు, ఏఓ కిషోర్‌బాబు, ఆగ్రో వెల్ లిమిటెడ్‌ మేనేజర్‌ ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

ఖమ్మంసహకారనగర్‌: రాజీవ్‌ యువ వికాసం పథకం ద్వారా లాభసాటి యూనిట్లు ఎంచుకునేలా అధికారులు పర్యవేక్షించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌ నుంచి బుధవారం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌, సీఎస్‌ కె.రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. రాజీవ్‌ యువ వికాసం లబ్ధిదారుల ఎంపిక, యూనిట్ల గ్రౌండింగ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ ముజమ్మిల్‌ఖాన్‌ ఆ తర్వాత అధికారులతో సమావేశమై దరఖాస్తుల పరిశీలన, జాబితా తయారీపై సూచనలు చేశారు. డీఆర్‌ఓ పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు జ్యోతి, నవీన్‌బాబు, పురంధర్‌, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతంపై దృష్టి

పల్లెల్లో తాగునీటి సమస్య రావొద్దు

- సమన్వయంతో పనిచేస్తూ లక్ష్యం సాధించాలి
- సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి సీతక్క
- పంచాయతీరాజ్‌ పనుల్లో నిర్లక్ష్యంపై ఆగ్రహం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క, పక్కన కలెక్టర్‌, ఎమ్మెల్యేలు కూనంనేని, వెంకటేశ్వర్లు, రాందాస్‌

చుంచుపల్లి: వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై క్షేత్రస్థాయిలో జరిగే వాస్తవాలను మాత్రమే ప్రభుత్వం దృష్టికి తేవాలని, తద్వారా ఏమైనా లోటుపాట్లుంటే సరిచేసుకోవచ్చని రాష్ట్ర పంచాయతీరాజ్‌, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. భద్రాద్రి కలెక్టరేట్‌లో ఐడీఓసీ, పంచాయతీరాజ్‌, మిషన్‌ భగీరథ శాఖల పనితీరుపై ఉమ్మడి జిల్లా అధికారులతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. అంగన్‌వాడీల బలోపేతంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందని, చిన్నారులకు అవసరమైన వసతులు సమకూర్చుతున్నామని, కార్పొరేట్‌ స్కూళ్ల దీటుగా ఈ కేంద్రాలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రాథమిక పాఠశాలల సమీపంలోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. భవనాలు లేని కేంద్రాలకు భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. పిల్లల్లో పౌష్టికాహార లోపం లేకుండా చూడాలని సూచించారు. గ్రామీణ ప్రాంత పిల్లల ఆటపాటల కోసం క్రష్‌ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

సురక్షిత తాగునీరు అందించాలి..

మారుమూల ప్రాంత ప్రజలకు సురక్షిత తాగునీరు అందించాలని మంత్రి సీతక్క అధికారులను సూచించారు. మిషన్‌ భగీరథ సమస్యలపై వారం పాటు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించాలని, 15 రోజులకు ఒకసారి వాటర్‌ ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టిన అధికారులను అభినందించారు. కాగా, పంచాయతీరాజ్‌ శాఖలో మంజూరైన పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టెండర్లు పూర్తయిన పనులు ఎందుకు చేయడం లేదని మండిపడ్డారు. కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేయకుంటే బ్లాక్‌ లిస్టులో పెడతామని హెచ్చరించారు. గిరిజనుల అభివృద్ధికి రోడ్లు, బ్రిడ్జిల ఏర్పాటు ముఖ్యమని, ప్రతీ గ్రామానికి కనెక్టివిటీ ఉండేలా రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ అనితా రామచంద్రన్‌, కమిషనర్‌ కాంతివెస్లీ, కలెక్టర్‌ జితేష్‌ వి.పాటిల్‌, మహబూబాబాద్‌ ఎంపీ పోరిక బలరాం నాయక్‌, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, జారే ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, రాందాస్‌ నాయక్‌, మట్టా రాగమయి, మహిళా శిశు సంక్షేమ శాఖ జేడీ సునంద, భద్రాద్రి, ఖమ్మం జిల్లాల అదనపు కలెక్టర్లు విద్యాచందన, శ్రీజ, సంక్షేమాధికారులు లెనినా, రాంగోపాలరెడ్డి, డీటీఓలు అశాలత, చంద్రమౌళి, పీఆర్‌ ఈఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టోన్‌ క్రషర్‌లో ఆర్‌డీఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్‌

ముదిగొండ: మండలంలోని పండ్రేగుపల్లిలో కొనసాగుతున్న బీపీఆర్‌ స్టోన్‌ క్రషర్‌ను ఖమ్మం ఆర్డీఓ గణేష్‌ నరసింహారావు బుధవారం తనిఖీ చేశారు. గ్రామ సమీపాన ఉన్న క్రషర్‌, క్వారీల్లో బ్లాస్టింగ్‌ చేయడానికి అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో ఇళ్లు దెబ్బతింటున్నాయని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్‌ సునీత ఎలిజబెత్‌తో కలిసి ఆర్డీఓ తనిఖీ చేశారు. రికార్డులు, అనుమతి పత్రాలు పరిశీలించిన ఆయన స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. బ్లాస్టింగ్‌ సమయాన వెలువడే శబ్దాలు, దుమ్ము, ధూళితో ఇళ్లల్లో ఉండలేక పోతున్నామని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఆర్డీఓ తెలిపారు. ఆర్‌ఐలు ప్రసన్నకుమార్‌, వహీదా పాల్గొన్నారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవానికి ఏర్పాట్లు

అదనపు కలెక్టర్‌ శ్రీనివాసరెడ్డి



బోనకల్‌ తహసీల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ శ్రీనివాసరెడ్డి

ఖమ్మంసహకారనగర్‌: వచ్చేనెల 2న రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్‌ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆయన డీఆర్వో ఎ.పద్మశ్రీతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న పథకాల వివరాలతో స్టాల్స్‌ సిద్ధం చేయాలన్నారు. ప్రతీ శాఖ అధికారులు, సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు. కాగా, వర్షాల నేపథ్యాన కేఎంసీ పరిధిలో డ్రైనేజీల శుభ్రం చేయించడంపై దృష్టి సారించాలని ఆదేశించారు. అంతేకాక ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక నంబర్‌తో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేయాలని అసిస్టెంట్‌ కమిషనర్‌ షఫీ ఉల్లాను ఆదేశించారు. సమావేశంలో కలెక్టరేట్‌ ఏఓ అరుణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

త్వరగా దరఖాస్తుల పరిష్కారం

బోనకల్‌: భూభారతి చట్టం అమలుకు నిర్వహించిన సదస్సుల్లో అందిన దరఖాస్తులను త్వరగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్‌ పి.శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. బోనకల్‌ తహసీల్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆయన రికార్డులు పరిశీలించారు. అనంతరం రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం, పరిష్కారంపై తహసీల్దార్‌ రమాదేవికి సూచనలు చేశారు.

రైలు నుంచి జారిపడి జార్ఖండ్‌ వాసి మృతి

ఖమ్మంక్రైం: కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు పడిన జార్ఖండ్‌ వాసి మృతి చెందాడు. జార్ఖండ్‌ రాష్ట్రంలోని దుర్మిజిల్లా బిలోకేంబా గ్రామానికి చెందిన అజయ్‌సింగ్‌ రైలులో వెళ్తుండగా బుధవారం ఉదయం ఖమ్మం – పందిళ్లపల్లి స్టేషన్ల మధ్య జారిపడ్డాడు. తీవ్రగాయాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ చేరుకుని అన్వయం ఫౌండేషన్‌ చైర్మన్‌ శ్రీనివాసరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

సైబర్‌ మోసంలో మరొకరి అరెస్ట్‌

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్‌లో ట్రేడింగ్‌ డబ్బు పెడితే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి సుమారు రూ. 1.62కోట్లు కాజేసిన కేసులో నాలుగో నిందితుడిని ఖమ్మం సైబర్‌ క్రైమ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. బోనకల్‌ మండలానికి చెందిన సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి జనీర్‌ నేరం నిందితుల చేతిలో మోసపోయాడు. ఈ మేరకు ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నాలుగో నిందితుడైన నల్లూరు అర్జున్‌ను సిద్దిపేటలో బుధవారం అరెస్ట్‌ చేసినట్లు సైబర్‌ క్రైమ్‌ డీఎస్పీ ఫణీందర్‌ తెలిపారు.

ప్లాట్ల అమ్మకంలో మోసంపై కేసు

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక సమీపాన వెంచర్‌ ఏర్పాటు చేసిన పలువురు ప్లాట్ల పేరుతో డబ్బు కట్టించుకొని ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారన్న ఫిర్యాదుపై కేసు నమోదైంది. 2011లో వెంచర్‌ ఏర్పాటు చేయగా, నెలకు రూ.2వేల చొప్పున 55నెలలు వాయిదాల పద్ధతిలో 2015 వరకు పలువురి నుంచి డబ్బులు వసూలు చేశారు. అయితే, 2016 తర్వాత వెంచర్‌ బాధ్యులు ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ చేయకుండా ముఖం చాటేయడంతో బాధ్యుల పోలీసులను ఆశ్రయించారు. దీంతో 11మంది ఫిర్యాదు చేయగా బుధవారం కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్‌ తెలిపారు. కాగా, ఈ ఘటనలో బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశముందని తెలుస్తోంది.

బ్రాండెడ్‌ పేరిట నకిలీ పైపుల విక్రయం

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని పలు షాపుల్లో బ్రాండ్‌ పేరుతో నకిలీ పైపులు అమ్ముతున్నారనే సమాచారంతో ఖమ్మం టాస్క్‌ఫోర్స్‌, వన్‌టౌన్‌, త్రీటౌన్‌ పోలీసులు బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు కస్బాబజార్‌లోని శ్రీకాంత్‌నాథ్‌, పీఎస్‌ఆర్‌ రోడ్డులోని శ్రీ ఎలక్ట్రికల్‌ ఎంటర్‌ ప్రైజెస్‌, తదితర దుకాణాల్లో తనిఖీ చేయగా అశ్విలాడ్‌ పేరిట నకిలీ పైపులు విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ మేరకు బాధ్యులపై కేసులు నమోదు చేశారు.

రూ.65 వేల నగదు చోరీ

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో ఓ ఇంట్లో భద్రపరిచిన నగదును పక్కింటి వ్యక్తి చోరీ చేశాడని ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రఘునాథపాలెం సీఐ ఉస్మాన్‌షరీఫ్‌ తెలిపారు. గత మార్చిలో గ్రామానికి చెందిన జె.సుభద్ర తన ఇంట్లో రూ.లక్ష నగదు దాచింది. అందులో రూ.65 వేలు కనబడకపోగా, ఇంటి పక్కన వ్యక్తి చోరీ చేశాడనే అనుమానంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేకు కన్నీటి వీడ్కోలు

- నివాళులర్పించిన మంత్రి తుమ్మల, వివిధ పార్టీల నేతలు
- పాడె మోసిన ఎంపీ రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ



మదన్‌లాల్‌ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల



పాడె మోస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ మంత్రి పువ్వాడ

రఘునాథపాలెం: వైరా మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ బానోత్‌ మదన్‌లాల్‌ అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామమైన రఘునాథపాలెం మండలం ఈర్లపుడిలో నిర్వహించారు. హైదరాబాద్‌ నుంచి ఆయన మృతదేహాన్ని మంగళవారం ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని నివాసగృహానికి తీసుకురాగా ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఈర్లపుడికి తరలించగా, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు మదన్‌లాల్‌ మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆ తర్వాత అంత్యక్రియల్లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ తదితరులు పాడె మోశారు. అలా గే, ఇల్లెందు, జనగామ ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్‌ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యేలు రేగా కాంతా రావు, సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీ మాలోత్‌ కవితతో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తుల్లూరి బ్రహ్మయ్య, రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, ఏనుగుల రాకేశ్‌రెడ్డి, దిండిగం రాజేందర్‌, బెల్లయ్యనాయక్‌, కూరాకుల నాగభూషణం, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్‌, ఆళ్లూరి వీరూనాయక్‌, మాదంశెట్టి హరిప్రసాద్‌, గుత్తా రవి, మెంటెం రామారావు, చిన్ని కోటేశ్వరరావు, చెరుకూరి ప్రదీప్‌, కూరాకుల వలరాజు, నాగండ్ల కోటి, మానుకొండ రాధాకిశోర్‌ తదితరులు సైతం మదన్‌లాల్‌ మృతదేహం వద్ద నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.